వైభవంగా దశమి ఉత్సవం

- భక్తజనుల మధ్య చింతలాముని, నల్లారెడ్డి స్వాముల పల్లకీ మహోత్సవం
- అడుగడుగునా స్వాముల అశ్వానికి పూజలు
- పులకించిన గోనెగండ్ల



స్వాముల అశ్వాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు, పూజలందుకుంటున్న చింతలాముని, నల్లారెడ్డి స్వామి

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో వెలసిన ఆది చింతలాముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం దేవాలయంలో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు తెల్లవారుజామున స్వామి వారి అశ్వాన్ని చింతలాముని, నల్లారెడ్డి స్వామి దేవాలయం నుంచి ఓబులేషు దేవాలయం వరకు అశేష భక్తుల జనుల హర్షధ్వనుల మధ్య ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా స్వాముల అశ్వానికి భక్తులు అడుగడుగునా పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఈ దశమి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దశమి ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, నాయకులతో కలిసి స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, దొరబాబు, ఉరుకుందు రెడ్డి, డాక్టర్ శివరాం తదితరులు ఉన్నారు.

ఎద్దుల బలప్రదర్శన పోటీలు ప్రారంభం

చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి సందర్భంగా ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలను శనివారం ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ప్రారంభించారు.

హోమియో వైద్యానికి పెరుగుతున్న ఆదరణ



మొక్క నాటుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, వైద్యులు భాస్కర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుతం హోమియో వైద్యానికి ఆదరణ పెరుగుతోందని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో కర్నూలుకు చెందిన దయల్బాగు రాధాస్వామి చారిటబుల్ సంస్థ హోమియో డిస్పెన్సరీ ప్రముఖ హోమియో వైద్యులు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 50వ హోమియో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో దాదాపు 406 మందికి పైగా రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం చారిటబుల్ సంస్థ ఆవరణలో డాక్టర్ భాస్కర్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, కోటేకల్ సర్పంచ్ లక్ష్మన్న, సంస్థ సభ్యురాలు పద్మజ, సంస్థ కార్యదర్శి కోటేకల్ పుల్లారెడ్డి, లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని డివిజన్‌లో వర్షపాతం

ఆదోని సెంట్రల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదోని డివిజన్ పరిధిలో గత రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా గొనెగొండ్ల మండలంలో 35.8 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా మంత్రాలయం మండలంలో 3.6 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. ఆదోని 33.4 మి.మీ, కోసిగి 26.6 మి. మీ, నందవరం 15.6మి.మీ, హోళగుంద 15.4 మి.మీ, పెద్దకడబూరు 10.6 మి.మీ, కౌతాళం 10.2 మి.మీ, ఎమ్మిగనూరు మండలంలో 8.2 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది.

కౌతాళంలో కుండపోత వర్షం

కౌతాళం: మండలంలో శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఆరున్నర గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షానికి కౌతాళంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రధాన విధులన్నీ జలమయమయ్యాయి. కౌతాళంలోని వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నుంచి రెండు అడుగుల వరకు వర్షం నీరు పారాయి. వడ్డె వీధిలో నాల్గు అడుగుల నీరు రావడంతో ఇళ్లల్లోకి నీరు చేరాయి. కురువ వీధి హనుమన్‌నగర్‌లో కూడా రెండు అడుగుల మేర నీరు చేరాయి. కాలనీ వాసులు వర్షపు నీటి బయటకు తొడే ప్రయత్నం చేశారు. స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న కాలనీలో, జెడ్పీ పాఠశాల ఏరియా, మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీలోని ఇళ్లల్లో వర్షపు నీరు చేరాయి. ఆదోని రోడ్డులో కూడా వర్షపు నీరు చేరడంతో వాహన దారులు ఇబ్బందుల పడ్డారు. జలమయమైన ప్రాంతాలను తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి పరిశీలించారు.



వైఎస్సార్ సర్కిల్ నుంచి దర్గాకు వెళ్లే రస్తాలో ఇలా..



కురవ వీధిలో దుస్థితి



వడ్డెవీధిలో ప్రవాహిస్తున్న వర్షపు నీరు



ఇంట్లో చేరిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి

సంక్షిప్తం

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

ఆదోని రూరల్: కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్ అని, కేసులను రాజీ చేసుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ మంచి వేదిక అని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.జె.సుధ అన్నారు. శనివారం ఆదోని కోర్టులో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో సీసీ 27, క్రిమినల్ అప్పీల్ 7, ఎక్సైజ్ 26, ఎస్టీసీ 273, అడ్మిషన్ 341, ఈపీ 24 మరియు ఇతర కేసులతో కలిసి 725 కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి తెలిపారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, న్యాయవాదులు ఎంఎండీ ఇస్మాయిల్, లోకేష్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు దసరా పండుగకైనా మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ శనివారం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు జి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, జయరాం, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయళ్ల అరెస్ట్

మంత్రాలయం రూరల్ : మంత్రాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి గుడి వెనుక భాగంలోని ఐసిరి చెట్టు కింద పేకాట ఆడుతూ 8 మంది పట్టుబడినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వీరిలో మంత్రాలయంకు చెందిన గాలి రామాంజితో పాటు మరో ఏడుగురు ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.28,860 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ డివిజన్ కార్యదర్శి శివ, పట్టణ కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ నాయకులు స్వామి, సమర్థ, వసంత, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

17న సురవరం సంస్మరణ సభ

ఎమ్మిగనూరుటౌన్: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఈనెల 17వ తేదీన పట్టణంలోని తేరుబజారులోని మంజునాథ మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న తెలిపారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సభకు పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ భవన సాధనకు ఐక్య పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికై ఐక్య పోరాటం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, భవన సాధన కమిటీ నాయకులు కదిరి కోట ఆదెన్న, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంద్ చైతన్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుర్ణికళ్యాణ మండపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వన సాధన కమిటీ ఆధ్వర్యంలో దళిత ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేయాలని, బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు భాస్కర్, మహదేవ్, జయమ్మ, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై 'రణభేరి'

ఎమ్మిగనూరుటౌన్: విద్యారంగం, ఆర్థిక సమస్యలపై ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి ప్రచార యాత్ర నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నాగమణి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సుధాకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే యూటీఎఫ్ రణభేరి యాత్ర కరపత్రాలను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్, లింగమూర్తి, వై.రామాంజినేయులు, మల్లారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ జరపాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఓ గర్భిణి మృతికి కారణమైన ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌పై అధికారులు సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్ర, శేఖర్‌నాయుడు, ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల నుంచి చికిత్సల పేరిట దోచుకుంటూ ఆస్పత్రికి వచ్చిన వారి మృతికి కారణమతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే ఆ అస్పత్రిపై విచారణ చేయాలని వారు కోరారు.

నేటి నుంచి ఉరుసు

ఆదోని రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సయ్యద్ ఖమర్ పీర్ ఖాద్రి ఉరుసు మహోత్సవాలు ఆదోని పట్టణంలోని కొడల్‌పేటలోని సమ్మద్ మాసుమ్ పీర్ దర్గాలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ శనివారం తెలిపారు. 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ (ముగింపు) కార్యక్రమాలు ఉంటాయన్నారు.

టీచర్ రామయ్యకు నివాళి

ఆదోని రూరల్: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు, కొర్రపాటి టీచర్ రామయ్య 5వ వర్ధంతిని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, పట్టణాధ్యక్షుడు వై.టి.భీమేష్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి

మంత్రాలయం రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక భీమా నిలయంలో మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 30 జతల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలను సాధిద్దాం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు

ఆదోని రూరల్: సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను సాధిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు రామాంజినేయులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్ నందు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం



విద్యార్థులతో అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, సభ్యులు

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శనివారం శివశంకర్ నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదోని పట్టణ అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రథమ చికిత్స ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన ప్రథమ చికిత్స కిట్‌ను అందించారు. కార్యక్రమంలో అవోపా పట్టణ కార్యదర్శులు రఘు, సభ్యులు వెంకటేశ్వర్లు, అవోపా మహిళా విభాగ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన



వరినాట్లు వేస్తున్న నాయకులు

కౌతాళం: కూటమి ప్రభుత్వానికి రోడ్లు బాగుపరచడం తెలియదా? అంటూ ప్రశ్నించారు సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న. శనివారం మండల పరిధిలోని బదినేహాల్ నుంచి ఆదోని మండలం జీహోసళ్లి రోడ్డుపై సీపీఎం ఆధ్వర్యంలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రోడ్డంతా గుంతలమయమై కనీసం పాదచారులు సైతం నడవలేని స్థితిలో ఉందన్నారు. రోడ్డులో రెండు నుంచి మూడు అడుగుల లోతు గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులు కూడా వెళ్లడానికి వీలు లేకుండా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబుబ్, శంకర్, చందాసాబ్, నవాజ్, బడేసాబ్, రమేష్, వన్నూరమ్మ, మోదీన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి పూజలు చేపట్టారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

పెచ్చులూడిన పైకప్పు..ఆరుబయటే చదువు



ఆరుబయటే తరగతుల నిర్వహణ

కోసిగి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని చిర్తనకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై కప్పు శుక్రవారం రాత్రి పెచ్చులూడి పడింది. శనివారం ఉదయం పాఠశాలకు విద్యార్థులు వెళ్లి చూసే సరికి తరగతి అంతటా పెచ్చులు పడి ఉన్నాయి. రాత్రి వేళలో పడిపోవడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు , విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామ సర్పంచ్ పాటిల్ ఈరన్న , విద్యార్థుల తల్లి దండ్రులు అక్కడికి చేరుకుని పాఠశాలను పరిశీలించారు. గోడకు కూడా చీలకలు ఏర్పడ్డాయి. అలాగే పైకప్పు అక్కడక్క ఉబ్బిపోయింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు. ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉండటంతొ విద్యార్థులను తరగతిలోకి పంపించకుండా ఆరుబయటే కూర్చొబెట్టి విద్యా బోధన చేపట్టారు. గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి రెండేళ్ల క్రితం అప్‌గ్రేడ్ కావడంతో ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 384 మంది విద్యార్థులు చదువుతున్నారు. కింద , పైన మూడేసి చొప్పున గదులు ఉన్నాయి. 2014-15 విద్యాసంవత్సరం పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారు. 2017వ సంవత్సరం నుంచి తరగతి గదులను వినియోగిస్తున్నారు. కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతోనే భవనం నిర్మించిన ఏడేళ్ల లోపే పెచ్చులూడిపోతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. జిల్లా ఉన్నత అధికారులు పర్యవేక్షించి పాఠశాలలో విద్యార్థులు ప్రమాదం గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.





పెచ్చులూడిన పాఠశాల పైకప్పు గది, పడిన పెంకులు

రాంజల చెరువు వద్ద పోలీసుల పహారా

ఆదోని అర్బన్: పట్టణంలోని రాంజల చెరువు వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందు వల్ల ప్రజలు ఈత కొట్టకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా త్రీటౌన్ పోలీసులు నిత్యం పహారా కాస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని త్రీటౌన్ సీఐ రామలింగయ్య కోరారు.



రాంజల చెరువు దగ్గర పహారా కాస్తున్న పోలీసులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

ఆదోని రూరల్: రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ఆదోని మెడికల్ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించి, రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాగా, అక్కడికి చేరుకున్న పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఎం.వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలను ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్వహిస్తామని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలన్నింటినీ ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదోని మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసి తక్షణమే తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడ తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు, ఉపాధ్యక్షులు రమణ, సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు